క్లుప్తంగా

సినిమా విజయం సాధించాలి..



చిత్రీకరణను ప్రారంభిస్తున్న చైర్మన్ వెంకటేశ్వరరావు

ఇల్లెందు: ఎస్ఆర్‌కే మీడియా సంస్థ ఆధ్వర్యాన నిర్మిస్తున్న సినిమా షూటింగ్ శుక్రవారం ఇల్లెందులో ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించనున్న ఈ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, కొరియోగ్రాఫర్ పాదిలి శ్యాంతో పాటు ప్రవీణ్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం



బాధ్యతలు చేపట్టిన కరుణాకర్

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని వన్‌టౌన్ సీఐగా ముప్పారాపు కరుణాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ మాట్లాడుతూ.. 2009 బ్యాచ్‌కు చెందిన తాను మొదట సీరోలు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేసినట్లు తెలిపారు. వరంగల్ నుంచి సీఐగా ప్రస్తుతం ఇక్కడకు రావడం జరిగిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తానని, చట్టాన్ని ఎవరు అతిక్రమించినా ఉపేక్షించేది లేదన్నారు.

ఇన్‌చార్జి ఎంపీఓగా కృష్ణ



జూలూరుపాడు: జూలూరుపాడు ఇన్‌చార్జ్ ఎంపీఓగా కృష్ణ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డి.రామారావు బదిలీపై దమ్మపేట వెళ్లారు. వెంగన్నపాలెం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణను ఇన్‌చార్జ్ ఎంపీఓగా డీపీఓ రమాకాంత్ నియమించారు. ఇటీవల దమ్మపేట నుంచి బదిలీపై వెంగన్నపాలెం పంచాయతీ కార్యదర్శిగా కృష్ణ వచ్చారు.

వితరణ

పాల్వంచరూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు సోమరాజ్‌దొర కోరిక మేరకు వర్తక సంఘం, చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాశ్, నారాయణ ఎలక్ట్రికల్ షాపు యజమాని మనోజ్ కుమార్, స్వీట్ మ్యాజిక్ యాజమాని కాటాబత్తిని దుర్గ, కంచర్ల కిషోర్, ప్రత్యూషల సహకారంతో.. రోగుల సౌకర్యార్థం వీల్‌చైర్, ఎయిర్‌కూలర్‌ను శుక్రవారం వితరణగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేష్ పాడ్య, చలవాది రాజ్యలక్ష్మి, గూడెపు శ్రీనివాస్, మహంకాళి సాయి పాల్గొన్నారు.

చురుగ్గా హైవే నిర్మాణ పనులు



రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

సుజాతనగర్: భద్రాచలం రోడ్ టూ సత్తుపల్లి రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా సుజాతనగర్ మండలంలో చేపట్టిన 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులకు గాను దక్షిణ మధ్య రైల్వే రూ.45 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి కాగా, వంతెనకు రెండు వైపులా సర్వీస్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆర్వోబీ వంతెన ప్రారంభం నుంచి సుజాతనగర్ వరకు, వంతెనకు ఇటువైపుగా గోధుమ వాగు వంతెన వరకు కూడా 4 లైన్లతో బీటీ రహదారిని నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో పాటు, రైల్వే వంతెన వద్ద రైలు వచ్చిన సమయంలో వాహనాలు ఆగే పరిస్థితి తప్పనుంది.

పశువులను హింసించడం సరికాదు..

సుజాతనగర్: పశువులను బందెలదొడ్డిలో హింసించడం సరైన విధానం కాదని సింగభూపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపించారు. గ్రామానికి చెందిన పలువురి రైతుల సుమారు 30 పశువులను పాత అంజనాపురం బందెలదొడ్డిలో శుక్రవారం కట్టేశారు. ఈ మేరకు సదరు రైతులు బందెలదొడ్డి వద్ద నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. తమ పశువులు బొంతుగుట్ట వద్ద క్వారీకి నీటి కోసం వెళుతున్నాయని, సమీపంలో పంటలు సాగు చేసే రైతులు పశువులను బందెలదొడ్డికి తరలించారని ఆరోపించారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో పశువులకు గ్రాసం, నీరు ఇవ్వకపోవడంతో గర్హనీయమన్నారు.

మొక్కల రక్షణకు తక్షణ చర్యలు

- నర్సరీల్లో గ్రీన్ నెట్‌ల ఏర్పాటు
- మొక్కలకు తరచూ నీటి తడులు
- 10 వేల మొక్కలు పెంచేలా చర్యలు



నర్సరీకి నెట్ ఏర్పాటు చేసిన దృశ్యం

చుంచుపల్లి: ఈ ఏడాది జూలైలో చేపట్టనున్న హరిత హారం కోసం నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. ఇందుకోసం ప్రతి పంచాయతీకి ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. హరిత నర్సరీల పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. ప్రతి నర్సరీలో పది వేల మొక్కలు ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్దేశించారు. ఇళ్లు, రహదారుల పక్కన, చెరువు కట్టలపై, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలను నాటడానికి అనువైన రకాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం వేసవిలో మొక్కలను రక్షించేందుకు అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొక్కలు అధిక ఉష్ణోగ్రతలకు వాడిపోకుండా, చనిపోకుండా రక్షణగా నీడ సౌకర్యం కలిస్తున్నారు. హరిత నర్సరీల్లో మొక్కలను తగిన నీడ కోసం గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లను ఏర్పాటు చేసి తరుచూ నీటి తడులు పెడుతున్నారు. ఉపాధి కూలీలు ఎప్పటికప్పుడు మొక్కలను పర్యవేక్షిస్తున్నారు. చుంచుపల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో హరిత నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 10 వేల చొప్పున సుమారు 2 లక్షల మొక్కలను పెంచుతున్నారు. వచ్చే జూలైలో చేపట్టనున్న హరితహారం కార్యక్రమంలో వీటిని నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.

మొక్కల రక్షణకు చర్యలు ఇలా..

- హరిత నర్సరీల్లో నాటిన ప్రతి విత్తు మొలకెత్తడానికి, తరువాత మొక్కను రక్షించడానికి కృషి చేస్తున్నారు. కవర్లలో ఎర్రరేగడి మట్టి, పంచాయతీల్లో తయారైన సేంద్రియ ఎరువు, సూపర్‌ఫాస్పేట్‌ను కలిపి అందులో గింజలను విత్తుతున్నారు.
- గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో టేకు, వెదురు, దానిమ్మ, ఆకాశ మల్లి, నిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, కర్జూరం, నిద్ర గన్నేరు, మల్బార్ వేప, గానుగ, వేప, కదంబ, గుల్‌మొహర్, మారేడు, స్పాంథోడియా, కరివేపాకు, గోరింట, ఉసిరి, చింత, రేగు, ఈత, నేరేడు వంటి 20 రకాలకు పైగా మొక్కలు పెంచుతున్నారు.
- ఇప్పటికే పెరిగిన కొన్ని రకాల మొక్కల కొమ్మలను కత్తిరించి నాటుతున్నారు. మొక్కలు బలంగా ఉండేందుకు నర్సరీల్లో కూలీలు తరచూ కలుపు తీస్తున్నారు. ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు. మొలకెత్తని గింజలను తొలగించి మళ్లీ విత్తుతున్నారు.
- ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఎండలు తీవ్రమయ్యాయి. దీంతో నర్సరీల్లో చిన్నగా ఉన్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సిబ్బంది చలువ పందిళ్లు (నెట్ వలలు) ఏర్పాటు చేస్తున్నారు.
- నర్సరీల్లోని మొక్కలకు తరచూ నీటి తడులు అందిస్తున్నారు. దీంతో మండే వేసవిలో మొక్కలు వాడిపోకుండా ఉంటాయని అధికారులు అంటున్నారు. మొక్కల పెంచే సంచులకు చదలు పట్టకుండా మందు చల్లుతున్నారు.

నర్సరీలను పర్యవేక్షిస్తాం



వచ్చే హరితహారం కోసం గతేడాది నవంబర్ నుంచి గ్రామ పంచాయతీల పర్యవేక్షణలో ఒక్కో నర్సరీల్లో పది వేల మొక్కల చొప్పున పెంచుతున్నాం. పూల మొక్కలతో పాటు నీడ నిచ్చే మొక్కలు ఉన్నాయి. ప్రతిరోజూ హరిత నర్సరీల్లో పనులను పర్యవేక్షిస్తుంటాం.

– నాగరాజు, ఉద్యోగి

మొక్కలు పెంచేలా శ్రద్ధ



మండలంలోని 18 గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత నర్సరీల్లో 2 లక్షల మొక్కలు పెంచుతున్నాం. మొక్కలు వాడిపోకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు కలుపు తీయిస్తున్నాం. వేసవి ఎండల దృష్ట్యా రోజుకు రెండుసార్లు నీటి తడులు అందిస్తున్నాం.

– గుంటి సత్యనారాయణ, ఎంపీఓ

కార్మికులతో డీఎల్పీఓ సమావేశం



కార్మికులతో సమావేశమైన డీఎల్పీఓ రాజీవ్ కుమార్

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎల్పీఓ రాజీవ్ కుమార్‌కు శుక్రవారం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్మికులు సమ్మెకు సిద్ధపడటంతో వారితో డీఎల్పీఓ కుమార్ జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చలు జరిపారు. ఎన్నో సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, పరిష్కరించే విధంగా చూడాలని డీఎల్పీఓను గ్రామ పంచాయతీ కార్మికులు కోరారు. స్పందించిన ఆయన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరాయంగా కొనసాగించాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు భూక్యా వీరు, ఉపాధ్యక్షుడు ఉబ్బనిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి సిరికొండ నరసింహారావు, తంబర్ల లక్ష్మి, వెంకటి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా చర్యలు పాటించండి



మాట్లాడుతున్న ఎస్ఈ రమేష్

ఇల్లెందురూరల్: విద్యుత్ వినియోగంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ మెరుగైన సేవలు పొందాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలలో భాగంగా సుభాష్‌నగర్‌లో శుక్రవారం విద్యుత్ భద్రత, పొదుపు అంశంపై సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతిఒక్కరూ విద్యుత్‌ను పొదుపు చేసి సంస్థ మనుగడకు సహకరించాలని కోరారు. ప్రజలు విద్యుత్ తీగలపై బట్టలు ఆరబెట్టవద్దని చెప్పారు. విద్యుత్ సరఫరాకు వినియోగించే తీగలు నాణ్యమైనవిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సదస్సులో డీఈ శేషాద్రి, ఏడీఈలు రవి, కోటేశ్వరరావు, ఏఈలు రాము, రవి, రమేష్, జేఏఓ గోవర్ధన్, సబ్ ఇంజనీర్లు, సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు చేయడంలో సొసైటీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్డిగూడెం, దంతలబోరు గ్రామంలో 25 రోజులుగా కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసి నిరీక్షిస్తున్నా సొసైటీ నిర్వాహకులు రైతులను పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం



జూలూరుపాడు: ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ సెక్రటరీలు

జూలూరుపాడు: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ శుక్రవారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. జేపీఎస్‌ల సమ్మె కారణంగా తమపై అదనపు భారం పడుతోందని, ఇతర జీపీలకు ఇన్‌చార్జ్‌లు పని చేయాల్సి వస్తుందని, పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఇన్‌చార్జ్ ఎంపీఓ కృష్ణ, కార్యదర్శులు బి.తిరుపతిరావు, సునీత, అశోక్, ప్రవీణ్, శ్రీనివాసరావు, వెంకటప్పయ్య, జ్యోతి, ఎంపీఓ కృష్ణ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శుల చేపట్టిన సమ్మెకు సంఘీభావంగా విజయలక్ష్మీనగర్ సర్పంచ్ పూనెం కవిత, ఎంపీటీసీ పూనెం సురందర్ సంఘీబావం ప్రకటించారు. శుక్రవారం వారు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

గ్రామపంచాయతీ సిబ్బంది నిరసన దీక్షలు



పాల్వంచలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామీణ గ్రామపంచాయతీ కారోబార్స్, సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్స్, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రత్యేక హోదా కల్పించి కనీస వేతనం రూ.21,500 ఇవ్వాలని, జీఓ 51 ప్రకారం వివిధ కేటగిరిలలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రత్యేక హోదా, కల్పించి కనీస వేతనం రూ.16,500 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, గ్రామపంచాయతీ సిబ్బంది మరణించినట్లు అయితే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షలో లింభానాయక్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు కూర్చున్నారు.

తాగునీటి ట్యాంకర్ల ఏర్పాటు

కొత్తగూడెంరూరల్: వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు జీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మంచి నీటి ట్యాంకర్లను గడల నరసింహారావు, జీవీఆర్ ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ చంద్రగిరి అంజి, గుగులోత్ ప్రభాకర్, మోదుగు జోగారావు, బోడ హరినాయక్, ఉజ్జీవరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటు

చుంచుపల్లి: స్థానిక విద్యానగర్ కాలనీలోని ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు ఆరో తరగతి విద్యార్థితో అసభ్యంగా ప్రవర్తించడం గర్హనీయమని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, పీడీఎస్‌యూ తదితర సంఘాల నాయకులు మండిపడ్డారు. సదరు ఉపాధ్యాయుడిపై కేసు నమోదైన నేపథ్యాన నాయకులు శుక్రవారం సదరు పాఠశాలకు వెళ్లి వివరాలు తెలుసుకుని మాట్లాడారు. పిల్లలను చేర్చుకునే సమయాన ఉండే ఉత్సాహం యాజమాన్యానికి ఆ తర్వాత లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. నాయకులు రత్నకుమారి, మంజుల, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, షమీం, ధనలక్ష్మి పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేయాలి

ఇల్లెందు: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాదావత్ ప్రతాప్ కోరారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని కొత్త బస్టాండ్ సివిల్ లైన్‌లో జరిగిన కార్యక్రమంలో పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... సామాజిక పరివర్తన, అణిచివేత, దొరల పాలన నుంచి విముక్తి, బహుజన రాజాధికారం కోసం బీఎస్పీ పోరాడుతుందని తెలిపారు. 7న సరూర్ నగర్ గ్రౌండ్‌లో జరగనున్న సభకు మాయావతి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాయల శ్రీనివాసరావు, లోకేష్, వాసూ, వీరబాబు, హైమావతి, వీరభద్రమ్మ, వెంకన్న, లక్ష్మి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా



మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ

కొత్తగూడెంరూరల్: వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రజలు ఆశీర్వదించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కొత్తవాళ్లు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, అంటువంటి వాళ్లకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రాజకీయాలు చేయాలంటే ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బట్టు సత్యనారయణ గౌడ్, శ్రీనివాస్‌కుమార్, ఆకుల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మాలోతు గాంధీ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి



బుట్టలు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా, మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: వ్యర్థ రహిత మున్సిపాలిటీగా కొత్తగూడెం పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వనమా వెంకటేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని 36 వార్డులలో పారిశుద్ధ్య పనులు, తడి, పొడి చెత్త నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు అఫ్జలున్నీసాబేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోలాపురి ధర్మరాజు, కౌన్సిలర్లు బాలశెట్టి సత్యభామ, రుక్మాంగధర్ బండారి, కొడగాని పరమేశ్ యాదవ్, పల్లపు లక్ష్మణ్, తంగేళ్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: పట్టణానికి నిత్యం కిన్నెరసాని నీరు సరఫరా చేస్తామని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం కాల్వతండాలో కిన్నెరసాని పంపు హౌజ్‌ను పరిశీలించారు. కొత్తగూడెంకు సరఫరా అవుతున్న కిన్నెరసాని జలాలను పర్యవేక్షించారు. మాట్లాడుతూ.. పట్టణానికి కిన్నెసాని నీటి సరఫరాకు కొంత అంతరాయం జరిగిందని, ఇక నుంచి ఎంటువంటి అంతరాయం జరగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, మున్సిపల్ కమిషనర్ రఘు, ఎంపీపీ భూక్యా సోనా, కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజు, రుక్మందర్‌బండారి, బాలిశెట్టి సత్యభామ, కూరపాటి విజయలక్ష్మి, దుంపల అనురాధ, ఏఈ రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలి

జూలూరుపాడు: కాకర్ల ఆరోగ్య ఉప కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీఆర్ఎస్ నాయకుడు దొండపాటి శ్రీనివాస్, గ్రామస్తులు శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. మాట్లాడుతూ.. గ్రామంలో 3500 జనాభా ఉందని, ఏ చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా సరైన సమయానికి వైద్యం అందడం లేదని ఎమ్మెల్యేకు వివరించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాన్ని పల్లె దవాఖానాగా మార్చడం గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ఎమ్మెల్యే రాములు నాయక్ సిఫార్సు చేసిన లెటర్‌ను శుక్రవారం అందజేసినట్లు చెప్పారు. దీనికి మంత్రి హరీష్‌రావు సానుకూలంగా స్పందించి, ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న పాతకొత్తగూడెం ప్రజలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాత కొత్తగూడెంలోని నాలుగు వార్డులలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం స్థానిక ప్రజలు ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పాతకొత్తగూడెం ప్రజలకు కనీసం తాగునీరు అందించని కౌన్సిలర్లు మాకొద్దని, స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే పాలకవర్గం, అధికారులు పట్టించుకోక పోవటం దారుణం అన్నారు. వేసవికాలం కాబట్టి ప్రజలను తాగులేక, స్నానాలకు నీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకవర్గం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. నీటితోపాటు డ్రెయినేజీ వ్యవస్థ, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆవుల శ్రీరాములు, కుక్కల ముత్తేష్, ఆవుల లక్ష్మి, చంద్రకళ, సాయి భాస్కర్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ పేరుతో కార్మికుల వేతనాల్లో కోత

సింగరేణి(కొత్తగూడెం): ఐటీ పేరుతో బొగ్గుగని కార్మికుల వేతనాల్లో కేంద్ర ప్రభుత్వం కోత విధిస్తూ వారి శ్రమను దోచుకుంటోందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. మే డే వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని సింగరేణి మెయిన్ ఆస్పత్రి, సెంట్రల్ వర్క్‌షాపు, మెయిన్ వర్క్‌షాపులలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విజయగిరి శ్రీనివాస్, జి.రాజారావు, వై.వెంకటేశ్వరరావు, కే.రమేష్‌బాబు, గడువు నర్సింహారావు, కే.సమ్మయ్య, జ్యోతి, శ్రీనివాస్, తుమ్మ రవికుమార్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామ కోదండ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవ పూజలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాతి ధ్వజస్తంభాన్ని తయారీ కేంద్రం నుంచి గ్రామంలోకి భారీ ప్రదర్శనగా తరలించారు. స్థానికులు ప్రత్యేక పూజ చేశారు. ఆలయం వద్ద ప్రత్యేకంగా యాగశాల నిర్మించి వేదపండితులు హోమం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పొద్దుటూరి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. శనివారం మహిళల చేత కుంకుమ పూజ,, గ్రామ నాభిశిల వద్ద సూక్త, పురుషసూక్త, దుర్గా సూక్త, హోమాది కార్యక్రమాలు నిర్వహించబడుతాయని చెప్పారు. 7న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మధ్యాహ్నం మహాన్నదానం, సాయంత్రం నాభిశిల, ముత్యాలమ్మకు బోనాల సమర్పణ ఉంటాయని వివరించారు. ఇదిలా ఉండగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ పురస్కరించుకొని ప్రతి ఇంటికి ఆడపడుచులు, బంధువులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి జాతర



అమ్మవారి విగ్రహాన్ని తీసుకొస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామ పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో జాతరను మూడు రోజులు ఘనంగా జరగనుంది. మొదటి రోజు(శుక్రవారం) శ్రీపెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆదివాసీలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. శనివారం సరువులను అడవి నుంచి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకరావడం, ఆదివారం నిప్పుల గుండం తొక్కడం, అమ్మవారికి బోనాలు సమర్పించడంతో జాతర ముగుస్తుందని ఆలయ ప్రధాన పూజారి ఈసం సాములు తెలిపారు. ఈ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం

పాలకుల నిర్లక్ష్యం కారణంగా టేకులపల్లి మండలం సులానగర్ రెండో నెంబర్ అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి అయోమయంగా మారింది. సులానగర్‌లోని సర్పంచ్ ఇంటి సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద 1986లో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. పంట పొలాల మధ్య నిర్మించడంతో మూడేళ్లకే ఎలుకలు, పందికొక్కులు చేరాయి. అంగన్‌వాడీ సామగ్రికి రక్షణ లేకుండా పోయింది. దీంతో అద్దె భవనంలోకి మార్చారు. 30 ఏళ్లుగా అద్దె భవనంలోనే అంగన్‌వాడీ కొనసాగుతోంది. అధికారులు స్పందించి నూతన అంగన్‌వాడీ భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కేఎం తార, సీడీపీఓ, టేకులపల్లి ప్రాజెక్టు
సెల్ నెంబర్: 94900 02168